ఈనాడు
అమరావతి
కృష్ణా
శనివారం జులై 8, 2023



# బందరులో ప్రాంతీయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి: ఎంపీ

**మచిలీపట్నం(కలెక్టరేట్), న్యూస్‌టుడే:** జిల్లా తీరప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మచిలీపట్నంలో ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నం రెవెన్యూ అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం సముద్ర సమాచార వ్యవస్థల



సదస్సు ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, పక్కన ఎంపీ బాలశౌరి, మంత్రి జోగి

భారత జాతీయ కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర మంత్రి జోగి రమేష్, ఎంపీ బాలశౌరి, కలెక్టర్ రాజబాబు, తదితరులు పాల్గొన్నారు. సదస్సులో ఎంపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మత్స్యకారులకు అందించే లక్ష్యంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారన్నారు. సముద్ర లోతు జలాల్లో వేట చేసేందుకు అవసరమైన బోటును ఎంపీ నిధులు, సీఎస్ఆర్ నిధులు కలిపి యాభైశాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆధునిక సాంకేతిక వ్యవస్థతో కూడిన బోటును అందించే దిశగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల మత్స్యకార యువతను గుర్తిస్తే బోటును అతి త్వరలో సమకూర్చేలా చూస్తామన్నారు. మత్స్యకారులకు అవసరమైన డ్రై ఫిష్ ప్లాట్‌ఫాంల ఏర్పాటుకు చొరవ తీసుకుంటామని ప్రకటించారు. మంత్రి జోగి మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా ఆధునిక సౌకర్యాలతో కూడిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణం శరవేగంగా సాగుతోందనీ, మచిపలీపట్నం పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంత దశదిశ మారిపోతుందన్నారు. కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానంతో సముద్రంలో మత్స్య సంపద ఉన్న ప్రదేశాలను గుర్తించి ఆ సమాచారాన్ని మొబైల్‌యాప్ ద్వారా మత్స్యకారులకు తెలియజేస్తారన్నారు. ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ఎన్.హరిహరన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ టి.శ్రీనివాసకుమార్, భూ విజ్ఞాన శాఖ జేడీ సెంథిల్ పాండియన్‌లు మత్స్యకారులకు ప్రభుత్వ సేవలను వివరించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్ ప్రతినిధులు డీప్ సీ ఫిషింగ్ గురించి విశదీకరించారు. తొలుత కేంద్ర మంత్రి ఇన్‌కాయిస్ సంస్థ సముద్ర సమాచార వ్యవస్థలో వినియోగించే పరికరాలు ప్రదర్శించారు. జేసీ అపరాజితసింగ్, మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.